ఆర్పీల వెనుక ఉన్నదెవరు..?





మెప్మాలో అధికారుల తీరుపై విమర్శలు

- డాక్యుమెంట్లు సరిగ్గా చూడకుండానే బ్యాంకర్ల రుణాలు
- సీఓలు అక్రమాలు చేయిస్తూ ఆర్పీలపై నిందలు
- సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి..
- పై స్థాయి అధికారుల పాత్ర ఉందని అనుమానాలు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళ సంఘాల సభ్యులను మోసం చేసి రుణాలను కాజేస్తున్నారన్న ఆరోపణలను ఆర్పీలు ఎదుర్కొంటున్న తరుణంలో నగరంలో కొత్త చర్చ తెరపైకి వచ్చింది. ఇటీవల ఓ ఆర్పీపై వచ్చిన ఫిర్యాదులు, ఆమె చేసిన మోసంపై అధికారుల చర్యలు ఎలా ఉన్నా.. సదరు ఆర్పీ వెనుక ఎవరి అండదండలు ఉన్నాయన్న చర్చ కేఎంసీలో జరుగుతుంది. ఏ అధికారి సహకారం లేకుండానే కొత్త మహిళా సంఘాలను ఏర్పాటు చేసే వరకు ఆర్పీ వెళ్లిందా..? సంఘాలను నిర్మాణం చేస్తున్న సమయంలో పాత సంఘాలను మనుగడలోకి తీసుకొచ్చేందుకు అనుమతులు ఎవరు ఇచ్చారు..? వాటిని ఆన్‌లైన్‌లో ఎవరు నమోదు చేశారు..? సీఓ, టీఎల్ఎఫ్ స్థాయి అధికారుల పాత్ర లేకుండానే ఇదంతా జరిగిందా..? అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఆర్పీ వెనుక ఉన్న వారిని బయటకు లాగేందుకు అధికారులు చర్యలేమి తీసుకున్నారు..? ఆర్పీని బాధ్యతల నుంచి తొలగిస్తే సమస్యను పరిష్కరించినట్లేనా..? వెనుక ఉన్న వారిని గుర్తించాల్సిన అవసరం లేదా అని ప్రశ్నిస్తున్నారు. రూ.కోటి వరకు కాజేసేందుకు జరిగిన స్కాంపై అధికారులు సీరియస్‌గా తీసుకోకుండానే తూతూ మంత్రంగా రిపోర్ట్ రాసి పైఅధికారులకు ఇచ్చినట్లు తెలుస్తోంది.

విచారణ చేపడితేనే..

మెప్మాలో జరుగుతున్న అక్రమాలపై అధికారులు ఉన్నతస్థాయిలో విచారణ చేయించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆరోపణలు వచ్చిన సమయంలో సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటున్నారే తప్ప మోసం వెనుక ఎవరు ఉన్నారనే దానిపై పూర్తిస్థాయి విచారణ చేయించడం లేదని తెలుస్తోంది. స్త్రీనిధి రుణ నగదును ఓ ఆర్పీ వినియోగించుకున్నదన్న ఆరోపణలు రాగా.. ఆ నగదును సీఓ, ఆ పైస్థాయి అధికారులు కూడా సొంతానికి వాడుకున్నారని, అందుకే నగదు బ్యాంకులో చెల్లించకపోయినా ఏమి మాట్లాడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం విచారణ చేపట్టకపోవడంతో ఆర్పీల వెనుక ఉంచి నగదును పక్కదారి పట్టిస్తూ వారు తప్పించుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. మెప్మాలో ఆర్పీ, సీఓ ఆ పై స్థాయి అధికారులు పాల్పడుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపితేనే జరిగిన అవకతవకలు వెలుగులోకి వస్తాయనే చర్చ తాజాగా కేఎంసీలో జరుగుతుంది. వీటన్నింటిపై ఓ లేఖ రూపం కొందరు ప్రశ్నలు సంధిస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

గతంలోనూ అనేకం..

మెప్మాలోని ఖమ్మం టీఎల్ఎఫ్ పరిధిలో ఇప్పటి వరకు అనేక అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. మహిళా సభ్యులను ఆర్పీలు మోసం చేయడంపై వస్తున్న ఆరోపణల దృష్ట్యా వారి పైస్థాయి సిబ్బంది చేస్తున్న అక్రమాలపై పలువురు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ఆర్పీలను అడ్డం పెట్టుకొని కొందరు సీఓలు నకిలీ సంఘాలను ఏర్పాటు చేసి రుణాలను తీసుకోవడం చేస్తున్నారని, గతంలో ఓ ప్రైవేట్ బ్యాంకులో ఇలా రుణం తీసుకున్నారని ప్రస్తుతం చర్చించుకుంటున్నారు. ఇక ఆర్పీలతో తప్పులు చేయించి కమీషన్లు, రుణ నగదు తీసుకుంటున్న సీఓలు అక్రమాలు వెలుగులోకి వచ్చినప్పుడు తమకు సంబంధం లేదని తప్పుకుంటున్నారన్న విమర్శలు ఆర్పీల నుంచి వస్తున్నాయి. అక్రమాలకు పాల్పడిన వారికి సీఓ పోస్టులు ఇస్తున్నారని, బతికుండగానే చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ తీసుకొని ఇన్సూరెన్స్ తీసుకున్న వారు సీఓ స్థాయిలో ఉన్నారని, వారు అక్రమాలు చేసుకుంటూ ఆర్పీలపై నిందలు వేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. టీఎల్ఎఫ్ అధ్యక్షురాలిగా చాలా ఏళ్ల నుండి ఒక్కరినే కొనసాగిస్తుండడంపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ మొక్కను సంరక్షించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: ఇంటింటికి ఆరు మొక్కలు చొప్పున పంపిణీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నాటి సంరక్షించాలని నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ సుగ్గుల వారి తోటలో ఇంటింటికి పూలు, పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గార్డెన్ సూపర్‌వైజర్ శేఖర్, డివిజన్ జవాన్ రాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 12వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు నుంచి రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయిన్ నిర్మాణ పనులకు శుక్రవారం మేయర్ నీరజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో నిధులు మంజూరు కాగ అభివృద్ధి పనులను వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మి నాగేశ్వరరావు, డీ.ఈ.ధరణికుమార్, నాయకులు సరిపుడి సతీష్, పాలెపు వెంకటరమణ, పాలకుర్తి నాగేశ్వరరావు, వల్లభనేని రామారావు, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవా రంగాలు నిర్వీర్యం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరసింహారెడ్డి

నేలకొండపల్లి: మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో మందడపు గోపయ్య–అనుసూయమ్మ, నాగుబండి సత్యనారాయణ–రాములమ్మల జ్ఞాపకార్థం నూతనంగా నిర్మించిన హాల్‌లో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం ఈ కేంద్రాన్ని మాజీ శాసన సభ్యుడు నంద్యాల నరసింహారెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ.. మహిళలు కుట్టు శిక్షణతో ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర అసమర్థ పాలన వల్ల ప్రభుత్వ సేవా రంగాలు నిర్వీర్యం అవుతున్నాయని అన్నారు. సీపీఎం ప్రజా ఉద్యమాలు కాకుండా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, రచ్చా నరసింహారావు, ఏటుకూరి రామారావు, కే.వీ.రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, దుగ్గి వెంకటేశ్వర్లు, కట్టెకోల వెంకన్న, ఎడ్ల తిరపతిరావు, శీలం అప్పారావు, వల్లంచెట్ల భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం అందించాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన ప్రభుత్వం ప్రకటించిన రూ.16,500 సాయం నేటికీ అందలేదని, తక్షణమే బాధిత కుటుంబాలకు అందేలా చూడాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సీపీఎం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యాన కేఎంసీ కార్యాలయంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. మున్నేరు వరద తాకిడికి సర్వం కోల్పోయిన బాధితుల వివరాలపై సర్వే చేసినా అందరి వివరాలను అధికారులు నమోదు చేయలేదని, దీంతో బాధితులు కేఎంసీ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందన్నారు. వెంటనే త్రీటౌన్ ప్రాంతంలోని బాధిత కుటుంబాలందరికి సాయం అందేలా చూడాలన్నారు. అనంతరం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం త్రీటౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాస్, నాయకులు యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, నాయకులు వజేనేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న సొసైటీ సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం/ నేలకొండపల్లి: మున్నేరు ముంపు ప్రాంతాల వారికి ఖమ్మం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన శుక్రవారం నిత్యావసర సరుకులతో పాటు వంట సామగ్రి అందజేశారు. రంగారెడ్డి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన సమకూర్చిన నిత్యావసరాలు, వంట సామగ్రిని ఖమ్మంలోని వికలాంగుల కాలనీలో 200 మందికి, సుర్దేపల్లిలో 120 మందికి అందజేసినట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు జనార్దన్‌రావు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వీరభద్రం, తాత రాఘవయ్య, మోహన్ రావు, బీవీచారి, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దాడి ఘటనపై ఫిర్యాదు

నేలకొండపల్లి: మండలంలోని శంకరగిరితండాకు చెందిన తేజావత్ వీరయ్య గురువారం రాత్రి తన భార్య ఇంటికి వెళ్లారు. ఈక్రమంలో భార్యాభర్తలకు మధ్య వివాదం చోటు చేసుకోవడంతో భార్య కుటుంబసభ్యులు అతడిపై దాడి చేసి గాయపరిచారు. దీంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రి, ఆపై ఖమ్మంకు తరలించారు. బాధితుడు తన బావమరిది, మరొకరిపై శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రాహుల్‌గాంధీని విమర్శిస్తే సహించేది లేదు

నేలకొండపల్లి: దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన రాహుల్‌గాంధీ కుటుంబాన్ని విమర్శిస్తే సహించేది లేదని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని మతాలను సమానంగా చూడాలే గానీ ఒకే మతానికి ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారన్నారు. జనసేన సెక్యూలర్ పార్టీ అనుకున్నామని కానీ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంతో వెళ్తున్నారని ఆరోపించారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి పవన్‌కు లేదని, పీఎం మోదీ మాయ నుంచి బయటకు రావాలని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బోయిన వేణు, బచ్చలకూరి నాగరాజు, కడియాల నరేష్, యడవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన హమాలీల నిరసన



నిరసనలో హమాలీలు, నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఎఫ్‌సీఐలో పనిచేస్తున్న సుమారు 100 మంది హమాలీలను అకారణంగా బదిలీ చేశారని, వారి బదిలీ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రెండో రోజైన శుక్రవారం సైతం సీఐటీయూ ఆధ్వర్యాన హమాలీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్, ఎఫ్‌సీఐ హమాలీ యూనియన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు మాట్లాడుతూ వంద మంది కార్మికులను బదిలీ చేయగా.. వారందరిని తక్షణమే వెనక్కు తీసుకోవాలన్నారు. ఇకనైనా సమస్యకు పరిష్కార మార్గం చూపించకపోతే ప్రజా సంఘాల మద్దతుతో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యర్రా మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధాన్యలక్ష్మి అలంకరణలో అమ్మవారు



ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనర సింహస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.


నీటి నాణ్యతపై అవగాహన

కామేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకుడు శిక్షణ కార్యక్రమంలో భాగంగా జీపీ సిబ్బందికి మంచినీటి నిర్వహణపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నీటి ప్రాముఖ్యత, వినియోగం, క్లోరినేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మధుసూదన్, మిషన్ భగీరథ డీఈ నరసింహారావు, మురళీకృష్ణ, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, ఏఈ సతీష్, వసంత్, ట్రైనర్ రమ పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లు చోరీ

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెం, ఆరెగూడెం గ్రామాల రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లను శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కోనాయిగూడెంకు చెందిన చింతమళ్ల ఆనంద్, ఆరెగూడెంలో దొడ్డారపు ఉపేందర్, దొడ్డారపు వెంకట్రావు వ్యవసాయ బావుల వద్ద మోటార్లు చోరీకి గురయ్యాయి. అసలే పంటలకు నీరందక అవస్థ పడుతున్న తరుణంలో మోటార్లు చోరీ కావడంతో ఆందోళనకు గురైన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీజీఆర్ఎఫ్ సభ్యుడిగా రామారావు



ఖమ్మం మామిళ్లగూడెం: టీజీఎస్పీడీసీఎల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిషన్ సభ్యుడిగా ఖమ్మంకు చెందిన మందడపు రామారావు నియమితులయ్యారు. ఈమేరకు విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేసి రైతులకు అండగా నిలుస్తానని రామారావు అన్నారు.

హైవే ఎక్కకుండానే ఫాస్ట్‌ట్రాక్ ఖాతా నుంచి నగదు డ్రా!

ఖమ్మంఅర్బన్: హైవేపైకి వెళ్లలేదు, టోల్‌గేట్‌ను తాకలేదు. అయినా ఓ వాహనదారుడి ఫాస్ట్‌ట్రాక్ ఖాతా నుంచి నగదు డ్రా అయ్యాయి. ఖమ్మం శ్రీనగర్‌కాలనీకి చెందిన అమరనేని నర్సింహారావు ఇటీవల కారు కొనుగోలు చేసి ఫాస్ట్ ట్రాక్ కార్డ్ తీసుకున్నాడు. ప్రస్తుతం ఆ కారు ఆయన ఇంట్లోనే ఉంది. అయితే, గురువారం ఉదయం 9–14గంటలకు ఏపీలోని చిల్లకల్లు వద్ద టోల్ దాటగా, ఫాస్ట్‌ట్రాక్ ఖాతా నుంచి రూ.110 డ్రా అయినట్లు సెల్‌ఫోన్‌కు సమాచారం వచ్చింది. దీంతో కంగారు పడిన నర్సింహారావు ఫాస్ట్‌ట్రాక్ కార్డు జారీ చేసిన ఏజెన్సీని సంప్రదించాడు. సాంకేతికంగా పొరపాటు జరిగి ఉంటుందని, త్వరలోనే నగదు తిరిగి జమ చేస్తామని చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నాడు.

బిల్ కలెక్టర్‌పై విచారణకు ఆదేశం

ఖమ్మంమయూరిసెంటర్: అదనపు నిర్మాణాల విషయంలో పన్ను తక్కువగా విధించేందుకు డబ్బు డిమాండ్ చేశాడనే ఆరోపణతో కేఎంసీలో బిల్ కలెక్టర్ విజయ్‌ను ఇటీవల సస్పెండ్ చేశారు. ఈమేరకు పూర్తిస్థాయిలో విచారణకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. డీఈఈ మాధవిని విచారణ అధికారిగా నియమించిన ఆయన విజయ్‌పై వచ్చిన ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	74	బచ్చలికూర	3
వంకాయ	40		20
బెండకాయ	28	పాలకూర	3
పచ్చిమిర్చి	28		20
కాకర	50	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	54	తోటకూర	3
దొండ	54		20
పొట్లకాయ	60	గోంగూర	5
చిక్కుడు	70		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	30		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		25
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	58		20
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

తీరొక్క పూలతో ముద్దపప్పు బతుకమ్మ

తీరొక్క పూలతో అందంగా తీర్చిదిద్దిన ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు శుక్రవారం విద్యాలయాలు, ప్రధాన కేంద్రాలు, మందిరాల్లో కనువిందు చేసింది. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు బతుకమ్మలతో తరలివచ్చి ఒకే చోట పేర్చి పూజలు చేశారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశాక సమీప ప్రాంతాల్లోని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. ఉపాధ్యాయులు బతుకమ్మ ప్రాధాన్యతను వివరించారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న ఉద్యోగులు



ఖమ్మంవైద్యవిభాగం: మెడికల్ కళాశాలలో కోలాటం ఆడుతున్న వైద్యులు, కళాశాల సిబ్బంది



ఖమ్మంగాంధీచౌక్: 56వ డివిజన్ విజయనగర్ కాలనీ సాయిబాబా మందిరంలో భక్తుల పూజలు



రెజొనెన్స్ శ్రీనగర్‌లో బతుకమ్మ సంబరాల్లో డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి తదితరులు



ఖమ్మం సహకారనగర్: ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బతుకమ్మలతో విద్యార్థినులు



టైనిటాట్స్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న యాజమాన్యం



రెజొనెన్స్ శ్రీనివాసనగర్‌లో బతుకమ్మలతో డైరెక్టర్ నీలిమ, తదితరులు

మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం వైరా రోడ్డులోని సత్తెపల్లి రామకృష్ణ భవన్‌లో ఈ నెల 7న ప్రారంభమయ్యే ఐద్వా ఖమ్మం జిల్లా 12వ మహా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మంలో నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయని, నిత్యావసర వస్తువులు అందుబాటులో లేకుండా పోయాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి మాచర్ల భారతితో పాటు బండి పద్మ, రమణ, మెహరున్నిసా బేగం, ప్రభావతి, నాగసులోచన తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలకు ఎల్ఓసీలు మంజూరు

ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్యంతో బాధపడుతూ.. శస్త్ర చికిత్స చేయించుకునే స్తోమతలేని ఇద్దరికి రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చెరో రూ.2లక్షల చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందేలా చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ములకలపల్లి మండలం వేపలగడ్డకు చెందిన వై.వెంకటేశ్వర్లు, కొణిజర్ల మండలం పెద్ద గోపతి గ్రామానికి చెందిన బి.హారికలు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈమేరకు వైద్యులను సంప్రదించగా.. హైదరాబాద్‌కు వెళ్లాలని చెప్పడంతో అక్కడ వారు శస్త్ర చికిత్స చేయాలన్నారు. దీంతో ఆ కుటుంబాలు వైద్య సాయం కోసం ఖమ్మంలో ఎంపీ క్యాంప్ కార్యాలయంలో సంప్రదించగా.. ఆయన సిఫారసు మేరకు తెలంగాణ ప్రభుత్వం చెరో రూ.2 లక్షలు మంజూరు చేస్తూ ఎల్ఓసీలు జారీ చేసింది. వీటిని ఎంపీ రవిచంద్ర కార్యాలయ సిబ్బంది బాధితులకు అందజేశారు.

మట్టి టిప్పర్లు అడ్డగింత

రఘునాథపాలెం: మండలంలోని జింకలతండా వద్ద మట్టి తవ్వకాలతో తాము అనారోగ్యాల బారిన పడుతున్నామని, రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయని పేర్కొంటూ గురువారం రాత్రి గ్రీన్‌కాలనీ వాసులు మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. ఆగస్టులోనే మట్టి తవ్వకాలకు అనుమతి అయిపోయిందని, అయినా రాత్రి పగలు అనే తేడా లేకుండా తవ్వకాలు చేపట్టడంతో తాము ఉండలేకపోతున్నామన్నారు.సమాచారం అందుకున్న సీఐ ఉస్మాన్‌షరీఫ్, సిబ్బందితో వెళ్లి నివాసులకు నచ్చజెప్పి నవంబర్ 3 తేదీ వరకు అనుమతి పత్రాలు ఉన్నాయని చెప్పి టిప్పర్లను పంపించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తహసీల్దార్‌ను కలవాలన్నారు. ఈ నేపథ్యాన అన్ని అనుమతులు తీసుకునే మట్టి తవ్వకాలు చేపట్టామని, అయినా టిప్పర్లను అడ్డుకున్నారని నేషనల్ హైవే నిర్మాణ సంస్థ సైట్ ఇంజినీర్ డి.పాపారావు శుక్రవారం సీఐ ఉస్మాన్‌షరీఫ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో టిప్పర్లను అడ్డుకున్న కాలనీకి చెందిన బి.వెంకటేష్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రెయినేజీ మరిపించేలా..!



ఆర్‌యూబీ వద్ద నిలిచిన వర్షం నీరు

ఖమ్మం రాపర్తినగర్: నగరంలోని మామిళ్లగూడెం–సారథినగర్‌కు రాకపోకలు కొనసాగేలా 2006లో రైల్వే శాఖ ద్వారా ఆర్‌యూబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. నాటి నుంచి ఏదో ఒక సమస్య వెంటాడుతూనే ఉంది. వర్షం పడితే డ్రెయినేజీని మరిపించేలా నీళ్లు నిలుస్తుండడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆప్రాంతవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది నెలల క్రితం బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని మున్సిపాల్ శాఖ, రైల్వే శాఖలు నిర్మాణం పూర్తి చేసినా ఇంకా అందుబాటులోకి రాలేదు. అయితే మూడో లైన్ కారణంగా దీనిని ప్రారంభించేందుకు అధికారులు సంకోచిస్తున్నారు. కాగా, బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా నీళ్లు నిలుస్తుండడంతో ఎప్పటి మాదిరిగానే రైల్వే పట్టాల మీద నుంచే నడవాల్సి వస్తుందంటున్నారు. దీనిని త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.